క్లుప్తంగా

బ్యాంకు ఖాతాల్లో సామాజిక పెన్షన్

గూడూరు: సామాజిక పెన్షన్ లబ్ధిదారులకు మే నెలకు సంబంధించి నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు గూడూరు ఎంపీడీఓ ఎస్.ప్రేమాన్విత తెలిపారు. పెన్షన్ల పంపిణీపై మంగళవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకు ఖాతాలు కలిగి ఉన్న లబ్ధిదారుల జాబితాలు గ్రామ సచివాలయాల్లో ప్రచురించారన్నారు. ఆయా బ్యాంకు ఖాతాల్లో బుధవారం పెన్షన్ మొత్తాన్ని జమ చేస్తామన్నారు. నగదు జమ కాకుంటే సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

ప్రతి గడపకు అందిన సంక్షేమాన్ని వివరిద్దాం

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని మరోసారి వివరించి అంతకు మించిన సంక్షేమం జగనన్నతోనే సాధ్యమవుతుందని తెలియజేద్దామని వైఎస్సార్ సీపీ నాయకులన్నారు. వారు మంగళవారం మండలంలోని యండపల్లిలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పి.మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బాపూజీ, సర్పంచ్ ప్రభుప్రసాద్, పార్టీ గ్రామ కన్వీనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పి తాళలేక యువతి బలవన్మరణం

పెడన: కడుపు నొప్పి తాళలేక యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బంటుమిల్లి మండలం కంచడం గ్రామానికి చెందిన జన్యావుల నాగభూషణానికి కుమారుడు, కూతురు. వీరు పెడన ఆరో వార్డులో అద్దెకు ఉంటున్నారు. గత నెల 28వ తేదీన కూతురు జన్యావుల నాగశ్రీసీతామహాలక్ష్మి(25) తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఇంట్లోని గడ్డిమందును సేవించింది. గమనించిన స్థానికులు తండ్రికి సమాచారం ఇవ్వడంతో ఆయన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి ఆ తర్వాత ఒక ప్రైవేటు హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం ఉదయం ఆ యువతి మరణించడంతో అక్కడ పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న పెడన పోలీసులు యువతి తండ్రి నాగభూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ టి. సూర్యశ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీక్షేత్రం ముసుగులో రౌడీ మూకలకు ఆశ్రయం
-పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు

పెదప్రోలు(మోపిదేవి): గాంధీక్షేత్రం ముసుగులో రౌడీ మూకలకు ఆశ్రయం కల్పించడాన్ని ప్రతి ఒక్కరూ అసహ్యించుకుంటున్నారని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌పై పెదప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదప్రోలులో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీవారసులమని చెప్పుకుంటూ జెండాలు, కండువాలు మార్చుకునే అలవాటు లేదంటూనే జనసేన నాయకులకు అన్యాయంచేసి ఏ పైరవీల ద్వారా సీటు సాధించారో చెప్పాలని కోరారు. సోమవారం పెదప్రోలు గ్రామంలో జనసేన పార్టీ సమావేశం ఏర్పాటు చేసి తన వ్యక్తిగత విషయాలపై లేనిపోని ఆరోపణలు చేయడంతో కుటుంబపరంగా ఎంతో కలత చెందానన్నారు. దివిసీమలో జరిగిన మర్డర్ల వెనుక ఎవరి హస్తం ఉందో తనకు తెలుసన్న తీవ్ర ఆరోపణలు చేశారు. మండవ పవన్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ విధానాలు నచ్చక, జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడనై తానంతట తానే స్వయంగా ఎమ్మెల్యే సింహాద్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరానని తెలిపారు. పునరాలోచన చేయాలని టీడీపీ నాయకులు కొందరు నాపై వత్తిడి చేశారని, తాను లేని సమయంలో మా ఇంటి ముంగిట చాలా వాహనాల్లో వచ్చి అల్లరి చేయడంతో మా కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారని ఆవేదన చెందారు. గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, మండల ఎస్సీసెల్ కన్వీనర్ పూర్ణచంద్రరావు, జగదీష్‌కుమార్, మండలయూత్ కన్వీనర్ బచ్చు దిలీప్, మండల ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో 61 మంది వలంటీర్ల రాజీనామా



చల్లపల్లి: చల్లపల్లి మండలంలో మంగళవారం 61 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. నడకుదురు, ఆముదార్లంక గ్రామాల వలంటీర్లు మొత్తం 25 మంది కూడా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం చల్లపల్లిలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును కలిసి మద్దతు తెలిపారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము



పోసినవారిపాలెంలో జరిగిన రోడ్ షోలో ఉప్పాల రాము

గూడూరు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గూడూరు మండలంలో రాము విజయీభవ యాత్ర నిర్వహించారు. పోసినవారిపాలెం పంచాయతీ నుంచి ప్రారంభమైన రోడ్ షో పలు గ్రామాల్లో కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిందేనన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన అభ్యర్థిగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికి ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇస్తున్న బూటకపు హామీలను నమ్మొద్దని ఉప్పాల రాము కోరారు. ఐదేళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిధుల సౌలభ్యం మేరకు మేనిఫెస్టో రూపకల్పన చేశారన్నారు. ప్రతి గ్రామంలో మైక్రో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందిస్తానని రాము హామీ ఇచ్చారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యమిస్తామన్నారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పార్టీ అధ్యక్షుడు పర్రం పెదబాబు, మాజీ జెడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, నాయకులు గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, ఆర్బీకే చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ మెరుగుమాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలతో వస్తున్నారు.. నమ్మొద్దు

పెడన: కల్లబొల్లి మాటలతో, అమలు కాని హామీలతో మీ ముందుకు వస్తున్న వారి మాటలను నమ్మొద్దని, ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల సంక్షేమానికి కృషి చేసిన జగనన్నకే ఓటేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్, పెడన ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) భార్య ఉప్పాల హారిక అన్నారు. మంగళవారం పెడన పట్టణంలోని 16, 17వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి గడప గడపకూ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అమలుకాని పథకాలు తీసుకువచ్చి రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి లాగడానికి చంద్రబాబు



పెడనలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతున్న ఉప్పాల హారిక

ముందుకు వస్తున్నారని, అటువంటి వారికి రాష్ట్రాన్ని అప్పగిస్తే ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తారని ఆరోపించారు. సీఎం జగనన్న పాలనలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావుకు, ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్‌కు రెండు ఓట్లు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి



రాము, గరుడప్రసాద్ తదితరులతో అయోధ్య రామిరెడ్డి

పెడన: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పార్టీ కుటుంబశ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్‌లతో పాటు పెడన నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కరపత్రాలు మే 2వ తేదీన అన్ని పార్టీ కార్యాలయాలకు చేరుతాయని, వాటిని పార్టీ శ్రేణులు ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలన్నారు. సమావేశంలో కృత్తివెన్ను, గూడూరు ఎంపీపీలు కూనసాని గరుడప్రసాద్, సంగా మధుసూదనరావు, కృత్తివెన్ను జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు బూరగడ్డ శ్రీకుమార్, బంటుమిల్లి ఏఎంసీ చైర్మన్ గంగాధర్ తదితరులున్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: ఎన్నికల ప్రచారంలో తమకు ప్రతి గ్రామంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సాయంత్రం చల్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు, ఎమ్మెల్యే తనయుడు సింహాద్రి వికాస్ బాబు దుకాణదారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, కడవకొల్లు చైతన్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), సర్పంచ్‌లు వల్లూరు ఉమా, తోట శ్రీనివాసు, గొరిపర్తి సురేష్, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



కోడూరులోని మందపాకలలో ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు ప్రచారం

కోడూరు: ప్రజల ఆశీర్వాదంతో సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే పగ్గాలు చేపడుతోందని ఆ పార్టీ బందరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని నక్కవానిదారి, జరుగువానిపాలెం, మందపాకల, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలతో పేదలు కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కుటుంబపోషణ సాగించగలిగారని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ పథకాలను అందించినట్లు చంద్రశేఖరరావు చెప్పారు. విద్య, వైద్య రంగానికి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని చంద్రశేఖరరావు కోరారు. అనంతరం గ్రామస్తులతో మమేకమయ్యారు. పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదల సొంతింటి కల సాకారం



నవీన్ మిట్టల్ కాలనీలో జరిగిన ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో పేదల సొంతింటి కల వైఎస్సార్ సీపీ పాలనలో మాత్రమే సాధ్యపడిందని ఆ పార్టీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు తెలిపారు. నవీన్ మిట్టల్ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం బందరు నియోజకవర్గంలోని 23, 377 పేద కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని గొప్ప సంకల్పంతో నిర్వహించారన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తిని మరొక్కసారి ముఖ్యమంత్రిని చేస్తే పేదల బతుకులు మరింత ఆనందంగా ఉంటాయన్నారు. ప్రతిపక్షాలు అమలు కాని, వాగ్దానాలు ఆచరణకు నోచుకోని మేనిఫెస్టోలతో ప్రజలను మోసం చేయాలని మరోసారి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారాలు



బందరులో ప్రచారం చేస్తున్న డెప్యూటీ మేయర్ శీలం భారతి

మచిలీపట్నంటౌన్: నగరంలో పలు రాజకీయ పక్షాల అభ్యర్థులు, నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. నగరంలోని పలు డివిజన్లలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 46వ డివిజన్‌లో కార్పొరేటర్ భోగాది సాయిబాబు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి ఇంటింటికీ తిరిగి ఎన్నికల కరపత్రాన్ని అందజేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదురుద్దీన్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. 3వ డివిజన్‌లో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 36వ డివిజన్‌లో కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, నాయకులు నూకల ప్రసాద్, దార్ల చెన్నకేశవరావు, కేశవరావు తదితరులు ప్రచారం చేశారు.

కోడూరు: వైఎస్సార్ సీపీ మండల నేతలు విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం కోడూరు అంబటి బ్రాహ్మణయ్య కాలనీ, ఎస్సీకాలనీల్లో ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలంటూ పార్టీ నేతలు ఇంటింటా ప్రచారం చేశారు. జెడ్పీటీసీ సత్యనారాయణ, మండల కన్వీనర్ మాధవరావు, పద్మావతి వరప్రసాద్, బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



పాపవినాశనంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సింహాద్రి వికాస్, ఉజ్వల, నిశ్చల

పాపవినాశనం(ఘంటసాల): ప్రజలకు మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని యువనేత సింహాద్రి వికాస్ అన్నారు. ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ కుమారుడు వికాస్, కుమార్తెలు ఉజ్వల, నిశ్చల స్థానిక నేతలతో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, వైఎస్సార్ సీపీ బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు డొక్కు అర్జునరావు, కుంపటి నాగేంద్ర బాబు, చిట్టూరి రమేష్, కనగాల సురేష్, బుర్రే పిచ్చియ్య, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే గిరిజనుల అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో ఎన్‌టీఎఫ్ నాయకులు

కోనేరుసెంటర్: గిరిజనుల అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్ చెప్పారు. మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు తమ మద్దతు తెలిపారు. బందరు మండలం నవీన్ మిట్టల్ కాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కిట్టును కలిసిన నాయకులు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు బందరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పేర్ని కిట్టుకు, ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావుకు విజయాన్ని అందజేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుడుముల రామచంద్రయ్య, ఎరుకల ఆత్మ గౌరవ సేవా సంఘం అధ్యక్షుడు మద్దెల రామకృష్ణ, ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కోశాధికారి తోకల చినవీరోజి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం చంటి, ఏపీ వైఎస్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏలూరు సునీల్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేశనం హేమంత్ సాయి పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో ప్రతి హామీ అమలు



పెదకళ్లేపల్లిలో ఎన్నికల ప్రచారం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ అర్హులందరికీ అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సతీమణి కెప్టెన్ లక్ష్మి తెలిపారు. పెదకళ్లేపల్లిలో ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి కుమార్తెలు, ఉజ్వల, నిశ్చల, అల్లుడు డాక్టర్ రంగనాథ్ గ్రామంలో ప్రతి ఇంటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరజా లక్ష్మీతులసా, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, లక్ష్మీయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



అవనిగడ్డలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



పెద్దకరగ్రహారంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో పేర్ని నాని



పెదపట్నంలో టీడీపీ, జనసేన కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిట్టు



బోడగుంట ఎస్సీకాలనీలో వైఎస్సార్ సీపీలో చేరినవారితో వికాస్‌బాబు, వీర వెంకటేశ్వరావు

బోడగుంట(మోపిదేవి): బోడగుంట గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ యువత సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. అవనిగడ్డ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్ బాబు, వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మునిపల్లి శివ, కొక్కిలిగడ్డ ఇమ్మానుయేలు, కొక్కిలిగడ్డ అజయ్‌బాబు, కొక్కిలిగడ్డ సుందర్‌సింగ్, తేళ్ల రూబేన్, కొమ్ము యేసు రత్నం, కొమ్ము లోకయ్య, కారుమూరి నాగేష్, తేల వినోదరావు, కొక్కిలిగడ్డ నవీన్ తదితరులు 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయ స్వార్థం కోసం టీడీపీ నాయకులు చేస్తున్న మోసానికి కచ్చితంగా తగిన గుణపాఠం చెబుతామన్నారు. పేదలు జగనన్న చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. మండలంలోనే వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ రావడానికి తమవంతు కృషి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా వికాస్‌బాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్న దేశంలోనే ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మనమంతా ఒక్కటై మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరావుకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి బహుమతిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇవ్వాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి..

అవనిగడ్డ: కృష్ణా జిల్లా కోడూరు మండల పరిధిలోని నారేపాలెం, సాలెంపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 150 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. అవనిగడ్డలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు 22ఎ నిషేధిత భూముల సమస్య, అవనిడ్డ – కోడూరు రోడ్డు రహదారి నిర్మాణం చేపట్టడంతో పార్టీలో చేరినట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో కోడూరు జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం నాయకులు కొండవీటి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: పెదపట్నం, పెద్దకరగ్రహారం గ్రామాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు సోమవారం రాత్రి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. పెద్దకరగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో బందరు ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పార్టీలో చేరిన.. టీడీపీ, జనసేన కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెదపట్నంలో జరిగిన కార్యక్రమంలో బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద కరగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో పరసా రాము, పరసా చెంచుల రావు, ఉయ్యూరు కృష్ణ పామర్తి పోతురాజు బడుగు అంజి బడుగు ప్రసన్న నూతన గుంట ప్రసాద్ కటకం వీరాంజనేయులు ఎండీ ఫరీద్ తదితరులు పార్టీలో చేరారు. పెద్ద పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పెదపట్నం టీడీపీ గ్రామ ఉపాధ్యక్షుడు వీరవల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, చిటికెన నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలఏసు, సర్పంచ్ గడిదేసి అనూష, గ్రామ ఇన్‌చార్జి రాజు, ఇతర పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ప్రసాద్ సేవలు మరువలేనివి



ప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పీఎస్ఆర్ ప్రసాద్ సేవలు మరువలేనివని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో డీఆర్డీఏ పీడీగా పనిచేస్తూ మంగళవారం పదవీ విరమణ చేసిన ఆయనకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రసాద్ అంకితభావంతో పనిచేసే వారన్నారు. పదవీ విరమణ విశ్రాంత సమయంగా భావించాలన్నారు. కుటుంబ సభ్యులతో గడపటంతో పాటు ఆహ్లాదకర ప్రదేశాలు తిరగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో ఆనందకుమార్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.